# వైఎస్సార్ చేయూతతో ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



వైఎస్సార్ చేయూత నగదు చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, కారుమూరి సునీల్



హాజరైన మహిళలు

నిడమర్రు: వైఎస్సార్ చేయూతతో మహిళలకు అదనపు ఆర్థిక భరోసా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కల్పించారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిడమర్రు మండలంలోని చేయుత పథకం లబ్ధిదారులకు నాలుగోవిడత నగదు జమ, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ మహిళలు అదనపు ఆదాయం పొందేందుకే ఈ వైఎస్సార్ చేయూత పథకం లక్ష్యమన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో చేయూత పథకంలో 15,849 మంది అక్క,చెల్లెమ్మల ఖాతాలో ఒకొక్కరికీ ప్రతీ ఏడాది రూ. 18,750 చొప్పున నాలుగేళ్లలో రూ. 69.40 కోట్లు నదును ఆర్థిక సహాయం అందించామన్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత ద్వారా పొందే డబ్బును ఉపయోగించుకోవడంలో అక్కచెల్లెమ్మలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తూ, దీన్ని ఇతర జీవనోపాధికి వినియోగించుకునే తోడ్పాటు ప్రభుత్వం అందిస్తుందన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బ రా జు మాట్లాడుతూ మహిళ బాగుంటే కుటుంబం బాగుంటుందనే నమ్మకం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిదన్నారు. ఈ సందర్భంగా నాలుగో విడతలో నిడమర్రు మండలంలోని 1995 మందికి రూ.3.74 కోట్లు చెక్కును లబ్ధిదారులకు అందించారు. అలా గే నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకంలో 1100 మంది లబ్ధిదారులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ స్టేట్ యూత్ సెక్రటరీ సంకు నాగశేషు, సచివాలయాల మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



నారాయణపురం సిరామిక్ పరిశ్రమలో మాక్ డ్రిల్ చేస్తున్న ఫైర్ సిబ్బంది

ఉంగుటూరు: సహజ, మానవ నిర్మిత విపత్తుల తోపాటు కెమికల్ డిజాస్టర్స్ నివారణపై విపత్తుల సంస్థ దృష్టి సారించిందని ఫలితంగానే ముంద స్తు అవగాహన కార్యక్రమాలు, జాగ్రత్త చర్యలతో పాటు ప్రణాళికలు రూపొందించడం వల్ల రసాయనిక ప్రమాదాలు తగ్గించవచ్చునని ఏలూరు ఆర్‌డీఓ ఖాజావల్లీ అన్నారు. గురువారం నారాయణపురం ప్రిజమ్ జన్సన్ సిరామిక్ పరిశ్రమలో ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పోలీసు, ఆరోగ్య, రవాణా ఏపీ ఎస్‌పీఆర్‌ఎఫ్ ,కాలుష్య నియంత్రణ మండలి విభాగాలతో పాటు ఇతర అధికారులు పాల్గొని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసమావేశంలో ఆర్‌డీఓ ఖాజావల్లీ మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు సాంకేతిక సిబ్బంది అప్రమత్తతతో మెలిగినపుడు పరిశ్రమలు ప్రమాదాలను నివారించగలమన్నారు. సందర్భానికి అనుగుణంగా సాంకేతిక సిబ్బంది పని చేయాల్సి ఉంటుందన్నారు. విశాఖ పరిశ్రమలో తలెత్తిన ప్రమాదాలు వల్ల జరిగిన నష్టాలను వివరించారు. జాన్సన్ సిరిమిక్ పరిశ్రమలో రసాయనిక ప్రమాదం జరిగితే ఎలా ప్రతి స్పందించాలో చర్యలు ప్రత్యక్షంగా చూపించారు. ఫ్యాక్టరీ సిబ్బందిని రక్షించడం, పునరావసకేంద్రాలకు తరలించడం, మెడికల్ క్యాంపులు జరపడం, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందించడం వంటి పక్రియలను ప్రత్యక్షంగా చూపించారు. జిల్లా అగ్నిమాపకాధికారి రత్నబాబు ఆధ్వర్యంలో ప్లాంటులో చిక్కుకున్న వారిని అధునాతన పరికరాలతో ఎలా బయటకు తీసుకురావాలో? అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులతో పాటు ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం



కైకరంలో మాట్లాడుతున్న పుప్పాల చిన్నబాబు

ఉంగుటూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పుప్పాల చిన్నబాబు అన్నారు. గురువారం సాయంత్రం కైకరం వనజర్ల ఫంక్షన్ హాలులో ఉంగుటూరు, భీమడోలు మండలాల బూత్ లెవెల్ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. మేము సిద్ధం–బూత్ సిద్ధం పేరిట నిర్వ హించిన సమావేశంలో చిన్నబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో మరడ మంగరావు, పుప్పా ల గోపి, సత్యనారాయణ, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లిజయలక్ష్మి, నక్కా శ్రీను, గంజి ప్రభాకరరావు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

**నిడమర్రులో..**

నిడమర్రు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మీ కుటుంబానికి మంచి జరిగిందని నమ్మితేనే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకి ఓటుతో మద్దతు తెలపండని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. గురువారం తోకలపల్లి, ఆముదాలపల్లి, బైనేపల్లి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ గ్రామస్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయాగ్రామాలకు ఎన్నికల పరిశీలకులుగా జెడ్పీటీసీ కోడే కాశి, కూనపురాజు సందీప్, మంత్రబుద్ధి అప్పారావులను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నియమించారని సత్యకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గణసల కృష్ణకుమారి, వంజరపు సత్యనారాయణ, ముగ్గళ్ల యాకోబు, పార్టీ అధ్యక్షులు బలే నల్లకొండలు, ఓగిరాల దావీదు, ఇసుకపాటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శివశివ శంకర హరహర శంకర



ప్రత్యేక అలంకరణలో బలివే గంగా పార్వతి రామలింగేశ్వరస్వామి



ఉంగుటూరు: భీమేశ్వరుని కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి: బలివే సోమద్రి నది తీర వాసి గంగా పార్వతి రామలింగేశ్వరస్వామి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని విజయరాయి శివారు బలివే తిరునాళ్ల ప్రారంభం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన షాపులు, విద్యుత్ అలంకరణలు, బుల్లెట్‌ట్రైన్, రంగుల రాట్నం వంటివి భక్తులను ఆకట్టుకుంటున్నారు. అలాగే తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో విజయరాయి, బలివే తోపాటు పట్టిసీమ, తాడువాయి, కలిదిండి మండ లం భోగేశ్వరం గ్రామలలోని శైవ క్షేత్రాల వద్ద పెద్ద ఎత్తున భక్తులకు ప్రసాద వితరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ఉంగుటూరులో ప్రత్యేక పూజలు**

ఉంగుటూరు: స్థానిక పార్వతీ భీమేశ్వర స్వామి ఆలయంలో వద్ద శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణం అత్యంత వైభంగా నిర్వహించారు. ఈఓ కలగర శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పత్తిపాటి దుర్గప్రసాదు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ప్రతి మనిషీ దయతో జీవించాలి

భీమడోలు: ప్రతి మనిషిలో దయ, జాలి గుణాలను అలవర్చుకోవాలని రెవరెండ్ పాలిమేర జయరావు అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో 37వ సజీవధారుల సువార్త మహా సభలు గురువారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా రెవరెండ్ పాలిమేర జయరావు వాక్యోపదేశాన్ని అందించారు. కార్యక్రమంలో విచారణకర్త రెవరెండ్ ఫాదర్ షింటో, స్కూల్ ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్, డైరెక్టర్లు జింటో, జోషి తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్లకు సత్కారం

దెందులూరు: వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షులు, శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీరామవరం ఆయన కార్యాలయంలో గ్రామంలోని వలంటీర్లను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు అక్కినేని శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యావిధానంపై అధ్యయనం



కొవ్వలి ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పరిశీలిస్తున్న ఉత్తరాఖండ్ ఎస్‌సీఈఆర్‌టీ బృందం

దెందులూరు: ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం అములుపై ఉత్తరాఖండ్ ఎస్‌సీఈఆర్‌టీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆశారాణి నేతృత్వంలోఆరుగురి సభ్యుల బృందం గురువారం పరిశీలించింది. కొవ్వలి ఉన్నత పాఠశాల ఎప్పుడు ప్రారంభమైంది? ప్రారంభంలో ఎలా ఉంది? ప్రస్తుతం ఏఏ పథకాలు పనులు జరిగాయని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆశా రాణిని పాఠశాల ప్రధానోపాధ్యాయులను శర్మను ప్రశ్నించారు. కొవ్వలి ఉన్నత పాఠశాల వసతులు, విద్యా విధానం పరిశీలించిన ఉత్తరాఖండ్ ఎస్‌సీఈఆర్‌టీ బృందం అబ్బురపడి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బృందంలో కేఎస్ బిజల్‌వాల్, రమేష్, మహేంద్రసింగ్,అరుణ్, సామ్యూల్, వినయ్‌లు ఉన్నారు. అనంతరం హెచ్‌ఎం శర్మ మాట్లాడుతూ దాత వెలమాటి జనార్ధనరావు పూర్తి సహాయసహకారాలు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రోత్సాహంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంస్థను జూనియర్ కళాశాల మంజూరు చేసిందన్నారు. దాత కొవ్వలి గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో విద్యాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నాడు–నేడు మన బడి పథకంతో పాటు ఆయన వ్యక్తిగతంగా కోట్లాది రూపాయలు వితరణ అందించారని వివరించారు.

# మహిళల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



పెదపాడులో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: రాష్ట్రంలో 30లక్షల మంది అక్క చెల్లెమ్మలకు సొంతింటి కల నెరవేర్చాలన్నదే సీఎం జగనన్న ఆశయమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని పెదపాడు గ్రామంలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పేదలకు ప్రభుత్వం అందించిన రిజిస్ట్రేషన్ ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదపాడు మండలంలో 90 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. మొదటి విడతలో 3082 మందికి లబ్ధి చేకూర్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం 130 0మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ అయిందని త్వరలో మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తరువాత వెంటనే అందిస్తామని చెప్పారు పెదపాడులో రూ. 11లక్షల జిల్లా పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన 0.5 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం తెలగాలపేటలో ఉన్న కాలనీ వారికి కూడా రిజిస్ట్రేషన్ పట్టాలు అందిస్తామని తెలిపారు. మహిళలు ఏ ప్రభుత్వం మంచి జరిగిందో? ఆలోచించుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు ముదుగురు సూర్యనారాయణ, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటసాల ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, తోటగూడెం ఎంపీటీసీ సభ్యుడు అక్కినేని గోపి, విజిలెన్స్ మెనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, కొత్తూరు, పాత ముప్పర్రు, తోటగూడెం సర్పంచ్‌లు కడిమి పద్మవతి, మెడబలిమి స్వరూపరాణి, ఏనుగ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కవ్వగుంటలోని బహుమతులు అందిస్తున్న దృశ్యం

పెదవేగి: సమాజంలో ఆడ– మగ తేడా లేకుండా ఇద్దరిని సమానంగా చూడాలని సర్పంచ్ మద్దాల వాణి అన్నారు. మోండలీజ్ సహకారంతో ఆఫ్రో సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కవ్వగుంట అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని మహిళా పోలీస్ లక్ష్మి, మాండలీజ్ కంపెనీ ప్రతినిధులు శిరీష,రూబీనా, చెల్లూరి బాబు, అయ్యన్న బాబు, ఆఫ్రో సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

**దెందులూరులో.**

దెందులూరు: బాలికలు, మహిళలు, సమాజం పట్ల అవగాహన పెంపొందించుకుని వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అమ్మన్‌రాజా అన్నారు. గురువారం దెందులూరు సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలలో మహిళా దినోత్సవం, మహిళల భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ టీనా మరియాను సత్కరించారు.

**పెదపాడులో...**

పెదపాడు: స్త్రీలను గౌరవిస్తే సమాజం పురోభివృద్ధి చెందుతుందని పెదపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పీ వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం నిర్వహించిన మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అలాగే జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం వట్లూరులోని టీటీడీసీ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు డి.పద్మావతి అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ విజయరాజు పాల్గొన్నారు.

**మహిళల పాత్ర కీలకం**

భీమడోలు: నేటి సమాజంలో మహిళల పాత్ర కీలకమని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంటెంట్ డాక్టర్ సునీత అన్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల వద్ద గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని మహిళా వైద్యులు, అధ్యాపకురాలును దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఓటు హక్కుపై కూడా అవగాహన కల్పించారు. ఎంపీడీఓ టి.స్వర్ణలత, ఎన్ఎస్ఎస్ అధికారి బి.శశికాంత్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కె.శివశంకర్ పాల్గొన్నారు.

### ఎంపీటీసీ మాజీ సభ్యురాలు నాగమణికి ఘన నివాళి

పెదపాడు: ఎంపీటీసీ మాజీ సభ్యురాలు నాగమణి మృతి పార్టీకి తీరని లోటని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. మండలంలోని పాతముప్పర్రు గ్రామ శివారు బాగినాయుడు పాకల గ్రామంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఆమె భర్త గొట్టాపు నర్సింహరావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఘంటా ప్రసాదరావు, ముదుగురు సూర్యనారాయణ, ఆళ్ల సతీష్‌చౌదరి, అక్కినేని గోపి, కత్తుల రవికుమార్ తదితరులు ఉన్నారు.

# అధికారుల గైర్హాజరుపై సభ్యుల నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అర్ధవరం రాము

గణపవరం: మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు అధికారులు రాకుంటే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని పలువురుసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అర్ధవరం రాము అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరుకావడం దురదృష్టకరమని ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ అర్ధవరం రాము ఎంపీడీఓ ప్రభాకరరావు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీడీఓ ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ విషయం జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానని, ఇకపై అన్నిశాఖల అధికారులు మండల సమావేశాలకు హాజరయ్యేలా చూస్తామని తెలిపారు. ఎంపీపీ అర్ధవరం రాము మాట్లాడుతూ మండలంలో ప్రతి ఎంపీటీసీ సభ్యుడికి రూ.3 లక్షల చొప్పున నిధులు ఇచ్చామని, వాటిని ఆయా ప్రాంతాలలో ఎన్నికల కోడ్ వచ్చేలోగా ఖర్చు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఫిల్టర్ చేసి, క్లోరినేషన్ చేసిన నీరు సరఫరా చేయాలని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు. మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాని ఎంపీడీఓ ప్రభాకరరావు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అందించిన ఆరోగ్యశ్రీ కార్డులను అందరూ ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ రైతులందరికీ ఈ–కేవైసీ పూర్తి చేశామన్నారు. మండలంలో ఎక్కడా సాగునీటి కొరతలేదని, నీటి సమస్య ఉంటే వెంటనే తమకు తెలియచేయాలని రైతులకు సూచించారు. ఎంఈఓ పుచ్చల శేషు మాట్లాడుతూ మండలంలో నాడు–నేడు పనులు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు సాగుతున్నట్లు చెప్పారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకుఅన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ జలజీవన్ పథకంలో చేపట్టిన పనుల పురోగతిని వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవరపు సోమలక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు సలాది దుర్గా రత్నకుమారి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు చనుమూరి దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.